కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

BNS
BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ అఫ్ న్యూ భారత్

కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

సంపుటి - 01 | సంచిక -192 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | 24-07-2026 | శుక్రవారం | పేజీలు : 4



# కుండపోతకు కౌంట్‌డౌన్!

- ఉపగ్రహాల్లో భారీ మేఘాల బెల్ట్
- దేశవ్యాప్తంగా కుండపోత వర్షాలు
- 170 శాతం అధిక వర్షపాతం
- మాన్సూన్ జోన్ పూర్తి చురుకు
- వచ్చే వారం భారీ వర్షాలు
- వరదలపై అధికారుల హెచ్చరిక
- ఖరీఫ్ పంటలకు భారీ ఊరట
- జలాశయాలు నిండే అవకాశాలు
- ఆసియా వ్యాప్తంగా మేఘాల విస్తరణ


**న్యూస్ డెస్క్, 23 జూలై (బిఎన్ఎస్ ):** గత జూన్ నెలలో దేశంలోకి రుతుపవనాలు ప్రవేశించినా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. దీంతో ఈ ఏడాది వర్షాలు అంతంతమాత్రంగానే ఉంటాయని నిపుణులు అంచనా వేశారు. కానీ ప్రస్తుతం జూలై నెలలో అందుకు భిన్నంగా పరిస్థితులు కనిపిస్తున్నాయి. గత కొద్దిరోజులుగా దేశ వ్యాప్తంగా భారీ వర్షాలే కురుస్తున్నాయి. దీంతో అన్నదాతలు, ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

తాజాగా వాతావరణ శాఖ మరో శుభవార్త చెప్పింది. ఉపగ్రహ చిత్రాల్లో ఉత్తర భారతదేశం నుంచి హిమాలయాలు, చైనా మీదుగా దక్షిణ కొరియా వరకు విస్తరించిన సుమారు 7,000 నుంచి 10,000 కిలోమీటర్ల పొడవైన భారీ వర్ష మేఘాల బెల్ట్ కనిపించింది. ఈ అరుదైన వాతావరణ పరిస్థితిని వాతావరణ శాస్త్రవేత్తలు "మాన్సూన్ కన్వర్జెన్స్ జోన్"గా పేర్కొంటున్నారు. భారత మహాసముద్రం నుంచి వచ్చే తేమతో నిండిన గాలులు ఆసియా ఖండంలోని పలు వాతావరణ వ్యవస్థలతో కలవడం వల్ల వేల కిలోమీటర్ల మేర మేఘాలు, వర్షపాతం కొనసాగుతున్నాయని నిపుణులు తెలిపారు. ఈ ప్రభావంతో భారత్‌లో గత రెండు రోజులుగా ఈ సీజన్‌లోనే అత్యధిక వర్షాలు నమోదయ్యాయి.

మిగతాది 2 లో..

# ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు

- 3,168 ఉద్యోగాలకు గ్రీన్‌సిగ్నల్
- నేతన్నలకు రూ.25 వేల భరోసా
- ఎల్‌నినోపై అప్రమత్తం
- రైతులకు ప్రభుత్వ గ్యారంటీ
- పుష్కరాలకు రూ.50 కోట్లు
- 20 లక్షల ఉద్యోగాల చర్చ
- భోగాపురం ఏర్పాట్ల సమీక్ష



2 లో

**న్యూస్ డెస్క్, 23 జూలై (బిఎన్ఎస్ ):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన ఏపీ మంత్రివర్గ సమావేశంలో రాష్ట్ర అభివృద్ధి, వ్యవసాయం, నీటిపారుదల, ఉద్యోగాల కల్పన, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్రంపై ఎల్ నినో ప్రభావం ఉండే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యవసాయ శాఖ, నీటిపారుదల శాఖ అధికారులను అప్రమత్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం సాగులో ఉన్న పంటల వివరాలు, ప్రధాన జలాశయాల్లో ఉన్న నీటి నిల్వలు, తాగునీరు, సాగునీటి లభ్యతపై సమగ్ర నివేదికను..

# తిరుమలలో హనుమాన్ విగ్రహం చోరీ

- 14 గంటల్లోనే నిందితుడు అరెస్ట్
- సీసీటీవీ ఆధారంగా దొంగ పట్టివేత
- ఒంగోలు రైల్వే స్టేషన్‌లో అదుపులోకి



2 లో

# పంజాబ్‌లో పేపర్ లీక్

- చిక్కుల్లో ఆమ్ ఆద్మీ పార్టీ..
- సీఎం రాజీనామా డిమాండ్
- కాంగ్రెస్--బీజేపీ ఆగ్రహం
- నాలుగు లీకుల ఆరోపణ
- దర్యాప్తుపై ప్రశ్నలు
- సిసోడియా వ్యాఖ్యల ప్రస్తావన




2 లో

**న్యూస్ డెస్క్, 23 జూలై (బిఎన్ఎస్ ):** దేశ వ్యాప్తంగా నీట్ పేపర్ లీక్ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద యువత భారీ ఎత్తున ఆందోళన నిర్వహిస్తున్నారు. పేపర్ లీక్‌కు కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ ఉద్యమానికి ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) , ఆ పార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ మద్దతుగా నిలుస్తున్నారు.

ఇదిలా ఉంటే, ఇదే సమయంలో ఆప్ అధికారంలో ఉన్న పంజాబ్‌లో పేపర్ లీక్ వ్యవహారం సంచలనంగా మారింది.

# డీజీపీ కార్యాలయంలో విషాదం



2 లో

- సర్వీస్ గన్‌తో కానిస్టేబుల్ ఆత్మహత్య
- సూసైడ్ నోట్‌తో వెలుగులోకి నిజాలు
- కుటుంబ కలహాలే కారణమా?
- క్లూస్ టీమ్ దర్యాప్తు ముమ్మరం
- సెంట్రీ డ్యూటీలోనే విషాదాంతం

# బలిసి మాట్లాడుతున్నారు



2 లో

- రాజకీయ ప్రత్యర్థులపై సీఎం ఘాటు వ్యాఖ్యలు
- రెండు ఓట్ల ఆరోపణలను ఖండించిన రేవంత్
- ఆధారాలుంటే ఫిర్యాదు చేయాలని సవాల్
- తండావాసుల ఓట్లను కాపాడాలని పిలుపు
- ఓటర్ల ప్రక్షాళనపై అధికారులకు సూచనలు
- 70 శాతం సర్వే పూర్తయిందన్న సీఎం
- బూత్ ఏజెంట్ల పాత్ర కీలకమన్న రేవంత్

# చేయూత పెన్షన్లలో భారీ ప్రక్షాళన

- ఈ నెలాఖరే సర్వే గడువు
- ఆగస్టు 15 నుంచి కొత్త పెన్షన్లు
- సెర్ప్‌కు ప్రభుత్వం కీలక ఆదేశాలు
- లక్షల దరఖాస్తులపై ప్రభుత్వ దృష్టి
- ముఖ గుర్తింపు సర్వే పూర్తి చేయాలి



**న్యూస్ డెస్క్, 23 జూలై (బిఎన్ఎస్ ):** తెలంగాణలో సంక్షేమ పథకాల పారదర్శక అమలే లక్ష్యంగా ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. చేయూత పెన్షన్ పథకం లబ్ధిదారులకు సంబంధించి గత కొన్ని నెలలుగా కొనసాగుతున్న లైవ్ అథెంటిఫికేషన్ ముఖ గుర్తింపు సర్వేను ఈ నెలాఖరు నాటికి అత్యంత వేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ ను ప్రభుత్వం ఆదేశించింది. ఈ సర్వేకు సంబంధించిన పూర్తి వివరాలు, సమగ్ర నివేదికను రూపొందించి ఆగస్టు 5 నాటికి ప్రభుత్వానికి సమర్పించాలని స్పష్టమైన సూచనలు జారీ చేసింది.

2 లో

# మరోసారి చర్చలకు పిలుపు

- విద్యార్థుల సమస్యలపై చర్చలకు సిద్ధం
- ప్రతినిధులకు పోమని జితేంద్ర సింగ్ స్పష్టం
- జేపీ నడ్డా నివాసంలోనూ చర్చలకు ఓకే
- కేంద్ర ప్రతిపాదనను తిరస్కరించిన విద్యార్థులు
- జంతర్ మంతర్‌కే రావాలని విద్యార్థుల డిమాండ్
- తాజా ఆహ్వానంపై విద్యార్థుల నిర్ణయంపై ఉత్కంఠ

2 లో

# భూములకు బ్లాక్‌చెయిన్ రక్షణ

- డిజిటల్ ఐడీ కేటాయింపు
- డబుల్ రిజిస్ట్రేషన్లకు చెక్
- ఏడు జిల్లాల్లో పైలట్
- భూ వివాదాలకు ముగింపు
- నవంబర్‌లో రాష్ట్రవ్యాప్త అమలు
- రికార్డులకు ట్యాంపరింగ్ అసాధ్యం



2 లో

**న్యూస్ డెస్క్, 23 జూలై (బిఎన్ఎస్ ):** రాష్ట్రంలో భూ రికార్డుల భద్రతను సరికొత్త స్థాయికి తీసుకెళ్తూ, భూ వివాదాలకు శాశ్వతంగా చరమగీతం పాడేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నుంచి వర్చువల్‌గా 'మీ భూమి-బ్లాక్ చెయిన్' పైలట్ ప్రాజెక్టును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించారు.

# సీజేపీకి పన్నూ రూ.10 కోట్ల ఆఫర్!

- జంతర్‌మంతర్ ఆందోళనలకు ఖలిస్థానీ మద్దతు?
- ఆగస్టు 15 వరకూ ఆందోళన చేస్తే రూ.10 కోట్లు!
- ఖలిస్థానీ నేత వీడియో కలకలం
- సీజేపీ ఆందోళనలకు కొత్త ట్విస్ట్
- సీజేపీ నిరసనలకు విదేశీ నిధుల ఆఫర్?
- పన్నూ ఆఫర్‌పై రాజకీయ దుమారం

2 లో

# గోదావరి పుష్కరాలకు రూ.150 కోట్లు

- ఏపీ సర్కార్ కీలక నిర్ణయం
- ఘాట్ల అభివృద్ధికి భారీ నిధులు
- భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి
- మౌలిక వసతుల మెరుగుదల వేగవంతం
- రాజమహేంద్రవరానికి రూ.100 కోట్లు
- 2027 పుష్కరాలకు ముమ్మర ఏర్పాట్లు

2 లో

# మరోసారి చర్చలకు పిలుపు



**న్యూస్ డెస్క్, 23 జూలై (బిఎన్ఎస్ ):** 'నీట్' పేపర్ లీకేజీ వ్యవహారంపై నిరసన తెలుపుతున్న 'కాక్రోచ్ జనతా పార్టీ'నాయకులను, విద్యార్థుల ప్రతినిధులను మరోసారి చర్చలకు రావాల్సిందిగా కేంద్ర ప్రభుత్వం పిలుపునిచ్చింది. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నామని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో ప్రభుత్వం ఎలాంటి పట్టింపులకు లేదా ప్రతిష్టలకు పోవడం లేదని జితేంద్ర సింగ్ తెలిపారు. "కేంద్ర మంత్రి జేపీ నడ్డా నివాసంలో గానీ, లేదా ఆయన ఆఫీస్‌లో గానీ చర్చలు జరపడానికి మేము సిద్ధంగా ఉన్నాం. ఏ సమస్య అయినా చర్చల ద్వారానే పరిష్కారం అవుతుంది. విద్యార్థుల భవిష్యత్తు, సంక్షేమం దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు తగిన నిర్ణయాలు తీసుకుంటోంది" అని ఆయన స్పష్టం చేశారు.

కాగా, బుధవారం మధ్యాహ్నం కూడా కేంద్ర ప్రభుత్వం విద్యార్థి నాయకులను చర్చలకు ఆహ్వానించింది. అయితే, ప్రభుత్వ ప్రతిపాదనను విద్యార్థి సంఘాలు తిరస్కరించాయి. "చర్చలు జరపాలనే ఉద్దేశం ఉంటే అధికారులు, మంత్రులే తాము ఆందోళన చేస్తున్న నిరసన స్థలి (జంతర్ మంతర్ వద్దకు రావాలి" అని విద్యార్థులు స్పష్టం చేశారు. విద్యార్థులు తమ పట్టు వీడకపోవడం, మరోవైపు కేంద్రం స్పందిస్తూ మళ్లీ చర్చలకు పిలుపునివ్వడంతో ఈ తాజా ఆహ్వానంపై విద్యార్థి నేతలు ఏ విధంగా స్పందిస్తారనేది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది.

# ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు

మొదటి పేజీ తరువాయి

వెంటనే సమర్పించాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. ఎల్ నినో ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని ముందస్తు చర్యలు తీసుకోవాలని మంత్రులకు కూడా సూచించారు.

ఉద్యోగాల భర్తీకి గ్రీన్ సిగ్నల్

రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మొత్తం 3,168 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి ఆమోదం తెలిపింది. అలాగే చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ 'నేతన్న భరోసా' పథకం కింద 52 వేల చేనేత కుటుంబాలకు ఏటా రూ.25 వేల చొప్పున ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించింది. ఉచిత విద్యుత్ సరఫరాతో పాటు అదనపు ఆర్థిక సహాయం ప్రకటించినందుకు మంత్రి సత్యకుమార్ యాదవ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎన్డీయే ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యారంగంలో భాగంగా బాపట్లలో వినికిడి లోపం ఉన్న విద్యార్థుల కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అలాగే రానున్న పుష్కరాల సందర్భంగా భద్రత, బందోబస్తు ఏర్పాట్ల కోసం రూ.50 కోట్లు మంజూరు చేశారు. రైతుల ప్రయోజనాల కోసం ఏపీ మార్క్‌ఫెడ్‌కు సెంట్రల్ బ్యాంక్ నుంచి లభించే రూ.300 కోట్ల రుణానికి ప్రభుత్వ గ్యారంటీ ఇవ్వడానికి కూడా క్యాబినెట్ అంగీకారం తెలిపింది కేబినెట్..

ఇక మధ్యాహ్నం మంత్రి నారా లోకేష్ అధ్యక్షతన జరిగే గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ (జీఓఎం) సమావేశంలో రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పన అంశంపై విస్తృతంగా చర్చించనున్నారు. అనంతరం సాయంత్రం భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవం సందర్భంగా ప్రధాని పర్యటన ఏర్పాట్లపై మంత్రులతో సమీక్ష నిర్వహించనున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ పర్యటనను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లు వేగవంతం చేస్తోంది. రాష్ట్ర అభివృద్ధి, వ్యవసాయ భద్రత, సంక్షేమం, ఉపాధి కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని తాజా మంత్రివర్గ నిర్ణయాలు స్పష్టం చేస్తున్నాయి.

# బలిసి మాట్లాడుతున్నారు: సీఎం



**న్యూస్ డెస్క్, 23 జూలై (బిఎన్ఎస్ ):** తెలంగాణ శాసనసభలో జరుగుతున్న పునర్నిర్మాణ, ఆధునీకరణ పనులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. అనంతరం అసెంబ్లీ ఆవరణలో విలేకరులతో ఏర్పాటు చేసిన చిట్ చాట్‌లో ఓట్ల సవరణ, ఓటర్ జాబితాల ప్రక్షాళన ప్రక్రియతో పాటు రాజకీయ ప్రత్యర్థుల విమర్శలపై సీఎం ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనకు రెండు చోట్ల ఓట్లు ఉన్నాయంటూ వస్తున్న విమర్శలపై స్పందిస్తూ.. 'నాకు ఎక్కడైనా రెండు ఓట్లు ఉన్నట్లు ఆధారాలు ఉంటే ధైర్యంగా ఫిర్యాదు చేయవచ్చు. నేను నా ఓటును నిబంధనల ప్రకారమే ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి బదిలీ చేసుకున్నాను. గతంలో కొడంగల్, గద్వాల, అలంపూర్ వంటి ప్రాంతాలు కర్ణాటక పరిధిలో ఉండేవి. చరిత్ర తెలియకుండా, బలిసి ఏది పడితే అది మాట్లాడుతున్నారు' అని తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

తండావాసుల ఓట్లను కాపాడే బాధ్యత కార్యకర్తలదే..

రాష్ట్రంలో తండాల్లో నివసించే గిరిజన ప్రజలు జీవనోపాధి. వృత్తి రీత్యా వివిధ ప్రాంతాలకు వెళ్తుంటారని, కేవలం ఓటింగ్ సమయంలోనే తమ స్వగ్రామాలకు వస్తుంటారని సీఎం తెలిపారు. అటువంటి పేద ప్రజల ఓట్లు జాబితా నుంచి గల్లంతు కాకుండా కాపాడాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపైనే ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకునే లక్ష్యంగా చేసుకుని తొలగించే కుట్రలు జరుగుతున్నాయని, ప్రతి ఇల్లు ఎక్కడుంది? ఓటర్లు ఎక్కడ నివసిస్తున్నారు? అనే స్పష్టమైన సమాచారం బూత్ లెవల్ ఏజెంట్లకు మాత్రమే సరిగ్గా తెలుస్తుందని చెప్పారు.

తొలగింపు కాదు.. ప్రక్షాళన పైనే దృష్టి పెట్టాలి..

ఓటర్ల జాబితా ప్రక్షాళన పేరుతో నిజమైన ఓటర్ల పేర్లను తొలగించే ప్రక్రియ జరగకూడదని, అసలైన ప్రక్షాళన ప్రక్రియపైనే అధికారులు, యంత్రాంగం దృష్టి సారించాలని సీఎం సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 70 శాతం సర్వే పూర్తయిందని, ఇంకా 30 శాతం సవరణ జరగాల్సి ఉందన్నారు. పార్టీ కార్యకర్తలు, బూత్ స్థాయి ఏజెంట్లు పూనుకుంటేనే ఓటర్ల హక్కుల పరిరక్షణతో పాటు ఏ పనైనా విజయవంతంగా పూర్తవుతుందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# గోదావరి పుష్కరాలకు రూ.150 కోట్లు



**న్యూస్ డెస్క్, 23 జూలై (బిఎన్ఎస్ ):** గోదావరి పుష్కరాలు–2027ను విజయవంతంగా నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పుష్కరాల ఏర్పాట్ల కోసం మొత్తం రూ.150 కోట్లకు పరిపాలనా అనుమతి మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధుల్లో రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్‌కు రూ.100 కోట్లు, కొవ్వూరు మున్సిపాలిటీకి రూ.20 కోట్లు, నర్సాపురం మున్సిపాలిటీకి రూ.15 కోట్లు కేటాయించింది. అలాగే నిడదవోలు, పాలకొల్లు, మండపేట మున్సిపాలిటీలకు కూడా అవసరమైన నిధులు మంజూరు చేసింది. ఈ నిధులను ప్రధానంగా పుష్కర ఘాట్ల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, ఇప్పటికే ఉన్న సదుపాయాల మరమ్మతులు, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సౌకర్యాల ఏర్పాటు వంటి పనులకు వినియోగించనున్నారు. పుష్కరాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

# తిరుమలలో హనుమాన్ విగ్రహం చోరీ

**న్యూస్ డెస్క్, 23 జూలై (బిఎన్ఎస్ ):** తిరుమల మొదటి ఘాట్ రోడ్డులోని ఏడో మైలు వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ విగ్రహం చోరీకి గురైన సంగతి తెలిసిందే. భారీ ఆంజనేయ స్వామి విగ్రహం పక్కన ప్రతిష్టించిన చిన్న విగ్రహాన్ని అర్ధరాత్రి సమయంలో దుండగులు దొంగలించారు. దొంగలించిన వ్యక్తి విగ్రహాన్ని ఓ వస్త్రంలో చుట్టి తీసుకువెళుతున్న దృశ్యాలు సీసీటీవీ కెమెరాలో రికార్డ్ అయ్యాయి. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు వెంటనే విచారణ ప్రారంభించారు. పోలీసులు, టీటీడీ విజిలెన్స్ అధికారులు కలిసి విగ్రహాన్ని వెతికేందుకు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించారు.

సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితుడు జస్వంత్ రెడ్డిగా గుర్తించారు. ఒంగోలు రైల్వే స్టేషన్ వద్ద రైల్వే పోలీసులు నిందితుడుని అదుపులోకి తీసుకుని విగ్రహం స్వాధీనం చేసుకున్నారు. కేవలం 14 గంటల్లోనే నిందితుడిని పట్టుకోవడంతో పోలీసులు, టీటీడీ విజిలెన్స్ విభాగానికి ప్రశంసలు అందుతున్నాయి. విగ్రహాన్ని తిరిగి అదే స్థానంలో ప్రతిష్టించగా, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా ఆలయం చుట్టూ ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేస్తామని అధికారులు వెల్లడించారు. మెట్ల మార్గంలో సీసీ టీవీ కెమెరాలను సైతం పెంచుతామని చెప్పారు.

# సీజేపీకి పన్నూ రూ.10 కోట్ల ఆఫర్!




**న్యూస్ డెస్క్, 23 జూలై (బిఎన్ఎస్ ):** ఢిల్లీలోని జంతర్‌మంతర్ వేదికగా కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆందోళనలు కొత్త మలుపు తిరుగుతున్నాయి. సీజేపీ చేపట్టిన నిరసనలకు ఖలిస్థానీ వేర్పాటువాది, సిఖ్స్ ఫర్ జస్టిస్ నేత గురుపత్వంత్ సింగ్ పన్నూ మద్దతు ఇస్తూనే, నిరసనకారులకు ఆఫర్ ఇచ్చినట్లుగా ఓ వీడియో సోషల్ మీడియాలో తీవ్ర కలకలం రేపుతోంది.

రూ.10 కోట్ల ఆఫర్.. జూమ్ కాల్ సంభాషణలు

వైరల్ అవుతున్న ఆ వీడియోలో పన్నూ మాట్లాడుతూ.. సీజేపీ నాయకులతో తాను జూమ్ కాల్‌లో మాట్లాడానని పేర్కొన్నాడు. కేంద్ర ప్రభుత్వంతో ఎలాంటి చర్చలు జరపవద్దని వారికి సూచించినట్లుగా తెలిపాడు. వచ్చే ఆగస్టు 15 వరకు జంతర్‌మంతర్ వద్ద ఆందోళనలను ఇలాగే కొనసాగిస్తే తాను సీజేపీకి రూ.10 కోట్ల ఆర్థిక సాయం అందిస్తానని ఓపెన్ ఆఫర్ ఇచ్చాడు. అంతేకాకుండా, మోదీ ప్రభుత్వం పతనం కావడం ఒక్కటే సరిపోదు.. భారతదేశం ముక్కలు కావడమే అసలైన పరిష్కారమని దేశ వ్యతిరేక వ్యాఖ్యలు చేశాడు. అయితే, ఆ వీడియోను తాజాగా భారతీయ జనతా పార్టీ ఎంపీ నిశికాంత్ దూబే తన ట్విట్టర్ లో షేర్ చేస్తూ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 'ఈ నిరసనల వెనుక ఎలాంటి దేశద్రోహ కుట్ర దాగి ఉంది?' అని ప్రశ్నిస్తూ ట్వీట్ చేయడం హాట్ టాపిక్‌గా మారింది.

# డీజీపీ కార్యాలయంలో విషాదం



**న్యూస్ డెస్క్, 23 జూలై (బిఎన్ఎస్ ):** తెలంగాణ డీజీపీ కార్యాలయంలో గురువారం ఉదయం సంచలనం చోటుచేసుకుంది. సర్వీస్ తుపాకీతో కాల్చుకుని సెంట్రీగా విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ స్వామి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. బుధవారం నైట్ షిఫ్ట్ డ్యూటీ వచ్చిన స్వామి ఉదయం సరిగ్గా 5.30కి వాష్‌రూమ్ వెళ్లి అక్కడే పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో గన్‌తో షూట్ చేసుకుని రక్తపు మడుగులో పడిపోయాడు. అనంతరం గమనించిన తొటి సిబ్బంది అతడిని ఆస్పత్రికి తరలించాలని అనుకున్నప్పటికీ అప్పటికే మృతిచెందాడు. ఇక స్పాట్‌కు వెళ్లిన సైఫాబాద్ పోలీసులకు ఓ సూసైడ్ నోట్ కూడా లభించింది. అందులో మృతుడు స్వామి తన భార్య, పిల్లలను ఏమీ అనవద్దని రాసి ఉన్నట్లుగా గుర్తించారు. అదేవిధంగా కుటుంబ కలహాల నేపథ్యంలో తన ఆత్మహత్యకు కారణం ఇద్దరని లేఖలో ప్రస్తావించినట్లుగా తెలుస్తోంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని.. అసలు స్వామి ఆత్మహత్యకు గల కారణలు ఏంటి? చివరిగా ఫోన్‌లో ఎవరితో మాట్లాడాడు అనే అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది.

ప్రస్తుతం డీజీపీ కార్యాలయానికి క్లూస్ టీమ్ తో పాటు సైఫాబాద్ పోలీసులు చేరుకుని పూర్తి ఆధారాలను సేకరిస్తున్నారు. పంచానామా అనంతరం స్వామి డెడ్‌బాడీని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించబోతున్నట్లుగా తెలుస్తోంది. దాదాపు రెండు స్వామి డీజీపీ కార్యాలయంలో సెంట్రీగా విధులు నిర్వర్తిస్తున్నాడని తొటి సిబ్బంది పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించి మరింత సమాచారం ఇంకా తెలియాల్సి ఉంది.

# చేయూత పెన్షన్లలో భారీ ప్రక్షాళన

మొదటి పేజీ తరువాయి

ఆగస్టు 15వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన కొత్త లబ్ధిదారులకు పెన్షన్లు మంజూరు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. దీనికి ముందస్తు చర్యల్లో భాగంగానే ఈ తాజా ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుతం పింఛను పొందుతున్నవారిలో అనర్హులను, మరణించిన వారిని అలాగే నిబంధనలకు విరుద్ధంగా లబ్ధి పొందుతున్న వారిని గుర్తించి జాబితా నుంచి తొలగించాలని ఆదేశించడంతో గత మూడు నెలలుగా రాష్ట్రవ్యాప్తంగా క్షేత్రస్థాయి సర్వే సాగుతోంది.

సెర్ప్ ఇప్పటివరకు నిర్వహించిన ముఖ గుర్తింపు నమోదు సర్వేలో ప్రాథమికంగా 1,21,229 మందిని అనర్హులుగా అధికారులు గుర్తించారు. రాబోయే రోజుల్లో వీరి వివరాలను పరిశీలించి పూర్తి స్థాయి తొలగింపు చర్యలు చేపడతారు. మరోవైపు.. కొత్తగా పెన్షన్లు పొందడానికి రాష్ట్ర వ్యాప్తంగా సుమారు పది లక్షల మందికి పైగా అర్హులైన వారు ఇప్పటికే ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు.

ప్రభుత్వం చేపడుతున్న ఈ సమగ్ర తనిఖీల నేపథ్యంలో మరో ఆసక్తికర అంశం వెలుగులోకి వచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 1157 మంది తమకు పెన్షన్లు వద్దంటూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి లబ్ధిదారుల జాబితా నుంచి పేర్లను తొలగించుకున్నారు. జిల్లాల వారీగా పరిశీలిస్తే నాగర్‌కర్నూల్ జిల్లాలో అత్యధికంగా 156 మంది, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 156 మంది తమ పెన్షన్లను వదులుకున్నారు. అలాగే ఖమ్మంలో 130 మంది, పెద్దపల్లిలో 90, మెదక్‌లో 83, సంగారెడ్డిలో 67, జగిత్యాలలో 64, రాజన్న సిరిసిల్లలో 55, సిద్దిపేటలో 44, రంగారెడ్డి, కరీంనగర్ జిల్లాల్లో చెరో 39 మంది చొప్పున తమ పింఛన్లను వదులుకోగా.. ములుగు మినహా మిగిలిన అన్ని జిల్లాల్లోనూ పలువురు స్వచ్ఛందంగా తమ హక్కును వదులుకోవడం విశేషం.


# పంజాబ్‌లో పేపర్ లీక్..

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో జరుగుతున్న వరస పేపర్ లీక్ వ్యవహారంపై కాంగ్రెస్, బీజేపీ భగ్గుమంటోంది. పంజాబ్ కాంగ్రెస్ అధ్యక్షుడు అమ్రిందర్ సింగ్ రాజా వారింగ్ మాట్లాడుతూ..పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ సీఎం భగవంత్ మాన్, విద్యాశాఖ మంత్రి హర్జోత్ సింగ్ బైన్స్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా జరిగిన పేపర్ లీక్‌లకు ప్రధాని నరేంద్రమోడీ, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను ఎలా బాధ్యత వహించాలో, అదే విధంగా పంజాబ్‌లో సీఎం, మంత్రి కూడా బాధ్యత వహించాలని అన్నారు.

ఆప్ సీనియర్ నేత మనీష్ సిసోడియా గతంలో పంజాబ్‌లో పేపర్ లీక్ జరిగినా సంబంధిత మంత్రి రాజీనామా చేయాల్సిందే అని చెప్పిన విషయాన్ని కాంగ్రెస్ నేత గుర్తుచేశారు. పంజాబ్ గ్రూప్–బీ పరీక్ష పేపర్ లీక్ అయి ఆరు నెలలు అవుతోంది, అంతకుముందు 12వ తరగతి ఇంగ్లీష్ పేపర్, ఫార్మాసిస్ట్ నియామక పరీక్ష పేపర్లు కూడా లీక్ అయ్యాయని అన్నారు. ఆప్ అధికారంలోకి వచ్చిన తర్వాత 4 ప్రధాన పేపర్ లీకులు జరిగాయని గుర్తుచేశారు. ఇప్పటి వరకు దీనిపై దర్యాప్తు లేదని, బాధ్యులపై చర్యలు లేవని అమ్రిందర్ సింగ్ అన్నారు.

# భూములకు బ్లాక్‌చెయిన్ రక్షణ



**న్యూస్ డెస్క్, 23 జూలై (బిఎన్ఎస్ ):** రాష్ట్రంలో భూ రికార్డుల భద్రతను సరికొత్త స్థాయికి తీసుకెళ్తూ, భూ వివాదాలకు శాశ్వతంగా చరమగీతం పాడేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నుంచి వర్చువల్‌గా 'మీ భూమి–బ్లాక్ చెయిన్' పైలట్ ప్రాజెక్టును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. రెవెన్యూ శాఖ రూపొందించిన ఈ ఆధునిక సాంకేతిక విధానం ద్వారా ప్రతి ల్యాండ్ పార్సెల్‌కు ప్రత్యేక డిజిటల్ ఐడీ కేటాయించనున్నారు. దీనివల్ల భూ రికార్డులను ఎవరూ ట్యాంపర్ చేయడానికి వీలుండదు. ప్రధానంగా డబుల్ రిజిస్ట్రేషన్ల సమస్యలను అరికట్టడంతో పాటు రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖలను ఒకే వేదికపైకి తెస్తూ భూ లావాదేవీలలో 'సింగిల్ సోర్స్ ఆఫ్ ట్రూత్'గా ఈ వ్యవస్థ ఉపయోగపడనుంది.

ఏడు జిల్లాల్లో పైలట్ ప్రాజెక్ట్ అమలు

ఎన్ఐసీ ఆంధ్రప్రదేశ్ , బెంగళూరులోని 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ బ్లాక్ చెయిన్ టెక్నాలజీ' సంస్థలు సంయుక్తంగా 'హైపర్ లెడ్జర్ ఫ్యాబ్రిక్' టెక్నాలజీతో ఈ వ్యవస్థను అభివృద్ధి చేశాయి. తొలిదశలో భాగంగా రాష్ట్రంలోని ఏడు జిల్లాల్లోని ఒక్కో మండలంలో దీనిని పైలట్ ప్రాజెక్ట్‌గా అమల్లోకి తెచ్చారు. కర్నూలు (ఆస్పరి), చిత్తూరు (పెనుమూరు), బాపట్ల (రేపల్లె), కృష్ణా (గన్నవరం), తూర్పు గోదావరి (కడియం), పార్వతీపురం మన్యం (గుమ్మలక్ష్మీపురం), విజయనగరం (కొత్తవలస) మండలాల్లోని 89 రీ–సర్వే గ్రామాలకు చెందిన 1,37,763 ల్యాండ్ పార్సెల్ మ్యాప్‌లను ఈ ప్రాజెక్ట్ పరిధిలోకి తీసుకువచ్చారు. ప్రారంభోత్సవంలో మంత్రి అనగాని సత్య ప్రసాద్, సీఎస్ సాయి ప్రసాద్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

భూ సమస్యలకు ముగింపు పలకడమే లక్ష్యం: సీఎం చంద్రబాబు

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. భూ రికార్డుల్లో లోపాల వల్ల అమాయక ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని, గత ప్రభుత్వ హయాంలో '22ఏ' పేరుతో కక్షసాధింపు చర్యలకు పాల్పడటంతో వివాదాలు మరింత పెరిగాయని విమర్శించారు. తెలంగాణతో పోలిస్తే ఏపీలో ల్యాండ్ లిటిగేషన్లు తక్కువే అయినప్పటికీ, రికార్డులను ప్రక్షాళన చేస్తూ పట్టాదార్ పాస్ పుస్తకాలపై రాజముద్ర వేసి ఇస్తున్నామని తెలిపారు. శెట్టిపల్లి, వట్టిచెరుకూరు, కంగుంది, గుటుపల్లి వంటి గ్రామాల్లో దశాబ్దాలుగా ఉన్న భూ వివాదాలకు తమ ప్రభుత్వం విముక్తి కల్పించిందని గుర్తుచేశారు.

నవంబర్ నాటికి రాష్ట్రవ్యాప్తంగా విస్తరణ

ప్రస్తుతం ప్రారంభించిన బ్లాక్ చెయిన్ టెక్నాలజీ అమలును రెండు నెలల పాటు క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఈ విధానంలో ఏవైనా సాంకేతిక లోటుపాట్లు ఉంటే వాటిని నమోదు చేసేందుకు ప్రత్యేకంగా ఒక కంప్లైంట్ సెల్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటి నుంచి సర్వే పూర్తయిన గ్రామాలన్నింటినీ ఈ బ్లాక్ చెయిన్ పరిధిలోకి తీసుకెళ్తామని, నవంబర్ నాటికి ఈ సాంకేతికతను రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా పెట్టుకున్నామని స్పష్టం చేశారు. భూ సమస్యలన్నీ పరిష్కారమైతే ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు గణనీయంగా తగ్గుతాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# కుండపోతకు కౌంట్‌డౌన్!

మొదటి పేజీ తరువాయి

సగటు కంటే 170–180 శాతం అధిక వర్షపాతం

వాతావరణ శాఖ అంచనాల ప్రకారం.. గత రెండు రోజుల్లో దేశవ్యాప్తంగా సాధారణ రోజువారీ మాన్సూన్ వర్షపాతం కంటే 170 నుంచి 180 శాతం అధికంగా వర్షాలు కురిశాయి. దీంతో ఇది ఈ సీజన్‌లోనే అత్యంత భారీ వర్షాల దశగా నిలిచింది. ఉపగ్రహ చిత్రాల్లో మధ్య, ఉత్తర, తూర్పు భారతదేశం మొత్తం దట్టమైన మేఘాలతో కప్పబడి ఉండగా.. ఆ మేఘాలు హిమాలయాలు, చైనా, జపాన్ వరకు విస్తరించినట్లు స్పష్టంగా కనిపిస్తోంది.

ఎలా ఏర్పడింది?

మాన్సూన్ ట్రఫ్ చురుకుగా కొనసాగుతున్న సమయంలో వాతావరణంలో తేమతో కూడిన గాలులు ఒకే ప్రాంతంలో కలిసిపోవడం వల్ల ఈ భారీ మేఘాల బెల్ట్ ఏర్పడింది. పైకి లేచిన తేమగాలులు చల్లబడి భారీ వర్ష మేఘాలుగా మారడంతో ఆసియాలోని అనేక ప్రాంతాల్లో విస్తృతంగా వర్షాలు కురుస్తున్నాయి. కొన్ని వారాలుగా దేశంలోని పలు రాష్ట్రాల్లో వర్షాభావ పరిస్థితులు కనిపించాయి. అయితే ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలతో ఉత్తర, మధ్య భారతదేశాల్లో సీజనల్ వర్షపాతం లోటు గణనీయంగా తగ్గే అవకాశముందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఇప్పటికే ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్, హర్యానా, ఢిల్లీ–ఎన్‌సీఆర్, రాజస్థాన్ రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. మరోవైపు బంగాళాఖాతం నుంచి ఏర్పడిన అల్పపీడనాల ప్రభావంతో తూర్పు, ఈశాన్య రాష్ట్రాల్లో కూడా కుండపోత కొనసాగుతోంది.

భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. రాబోయే రోజుల్లో కూడా ఇదే తరహా వర్షాలు కొనసాగనున్న నేపథ్యంలో ఆకస్మిక వరదలు, పట్టణాల్లో నీటిమునక, కొండచరియలు విరిగిపడటం, నదుల్లో వరద ప్రవాహం పెరగడం వంటి ప్రమాదాలు ఉన్నాయని హెచ్చరించారు. ముఖ్యంగా ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో ప్రమాద సూచనలు ఎక్కువగా ఉన్నాయని వెల్లడించారు.

ఈ అరుదైన మేఘాల బెల్ట్ ఆసియా ఖండంలోని వాతావరణ వ్యవస్థలు ఎంతగా పరస్పరం అనుసంధానమై ఉన్నాయో మరోసారి నిరూపించిందని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు. భారత్‌లోని నైరుతి రుతుపవనాలు కేవలం దేశానికే పరిమితం కాకుండా అరేబియా సముద్రం నుంచి పశ్చిమ పసిఫిక్ మహాసముద్రం వరకు విస్తరించిన భారీ వాతావరణ చక్రంలో భాగమని ఉపగ్రహ చిత్రాలు స్పష్టం చేస్తున్నాయి. వచ్చే వారం రోజుల పాటు కూడా మాన్సూన్ చురుకుగా కొనసాగుతుందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. దీంతో దేశంలో వర్షాభావం మరింత తగ్గడంతో పాటు జలాశయాలు నిండిపోవడం, ఖరీఫ్ పంటలకు అవసరమైన నీటి లభ్యత మెరుగుపడే అవకాశముందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# కేంద్రం ఆఫర్‌ను తోసిపుచ్చిన సీజేపీ.. నేడు దేశవ్యాప్త ఆందోళనలు



**న్యూస్ డెస్క్, 23 జూలై (బిఎన్ఎస్ ):** పేపర్ లీకేజీ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం ఎంత భరోసా ఇచ్చినప్పటికీ వెనక్కి తగ్గేదే లేదని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) స్పష్టం చేసింది. విద్యార్థుల భవిష్యత్తు, ప్రయోజనాల కోసం జులై 24న దేశవ్యాప్త నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చింది. పేపర్ లీకేజీల నియంత్రణకు, భవిష్యత్తులో ప్రవేశ పరీక్షలను పారదర్శకంగా నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు స్పష్టం చేస్తున్నప్పటికీ సీజేపీ నాయకులు, విద్యార్థి ప్రతినిధులు సంతృప్తి చెందడం లేదు. ప్రభుత్వం ఇచ్చే ప్రకటనలు, హామీలు కేవలం కాలయాపనకే తప్ప సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం లేదని వారు ఆరోపిస్తున్నారు.

వీధుల్లోకి విద్యార్థులు, యువత..

జులై 24న నిర్వహించ తలపెట్టిన ఈ ఆందోళనలో భాగంగా దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో, ప్రధాన నగరాల్లో భారీ నిరసన ప్రదర్శనలు, ధర్నాలు నిర్వహించేందుకు సీజేపీ ప్రణాళికలు సిద్ధం చేసింది. పేపర్ లీకేజీల బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలని వారు కోరుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఒకవైపు చర్చలకు పిలుపునిస్తున్నా, మరోవైపు నిరసనలు ఉధృతం కానుండటంతో దేశవ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

BNS BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ అఫ్ న్యూ భారత్
24-07-2026

# కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తక్షణమే భర్తరఫ్ చేయాలి




శేరిలింగంపల్లి: AIFDS AISF విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మదినాగూడ నుండి చందా నగర్ అంబేద్కర్ విగ్రహం వరకు బారి ర్యాలీ చేసి కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దిష్టి బొమ్మ దగ్ధం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏ ఐ ఎఫ్ డి ఎస్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పల్లె మురళి గడ్డం నాగార్జున మాట్లాడుతూ....దేశ విద్యార్థుల, యువత రక్తం చూడటమేనా దేశభక్తి?

విద్యార్థి ఉద్యమాలపై దమనకాండను వెంటనే నిలిపివేయాలి.

దేశంలో బీజేపీ ప్రభుత్వం బ్రిటీష్ పాలనను తలపించే విధంగా వ్యవహరిస్తోంది.

ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడుతున్న విద్యార్థులు, యువతపై నిర్బంధ చర్యలు ఖండనీయం.

ఢిల్లీలో పార్లమెంట్ మార్చ్ సందర్భంగా విద్యార్థులు, యువతపై జరిగిన లాఠీచార్జ్, బాష్పవాయువు ప్రయోగం, దాడులు చేయడం సిగ్గు చేటు

విద్యార్థి, యువతపై జరిగిన దాడులకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెంటనే మంత్రివర్గం నుండి భర్తరఫ్ చేయాలి.

న్యూఢిల్లీలోని జంతర్ మంతర్‌లో కొనసాగుతున్న విద్యార్థి ఉద్యమానికి సంఘీభావంగా, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ AIFDS మరియు వామ పక్ష విద్యార్థి సంఘాల తెలంగాణ రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించే రాష్ట్ర వ్యాప్తంగా విద్యా సంస్థల బంద్ లో విద్యార్థులు, తల్లి దండ్రులు మేధావి వర్గం అందరూ పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో AISF శేరిలింగంపల్లి మండల కార్యదర్శి తేజ, AIFDS జిల్లా కార్యదర్శి శ్రీకాంత్, జిల్లా అధ్యక్షులు అరుణ్, గణేష్, దుర్గాప్రసాద్, గణేష్, ఈశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# సన్నపురెడ్డి సురేష్ రెడ్డి సౌజన్యంతో మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం

నెల్లూరు జిల్లా రాపూరు (బి.యన్.యస్):- ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ రాపూరు బస్టాండ్ నందు మెడికవర్ హాస్పిటల్స్, సౌజన్యంతో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంకు APSRTC ఉద్యోగుల నుంచి విశేష స్పందన లభించింది. వెన్నునొప్పి, మెడ నొప్పి, డిస్కుసమస్యలు, డయాభేటీస్, సయాటికా, గుండె సమస్య లు, వంటి సమస్యలతోబాధపడుతున్న వారికి నిపుణులచే ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్యసూచనలు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రా రోడ్డు రవాణా సంస్థ జోనల్ చైర్మన్ సన్నపు రెడ్డి సురేష్ రెడ్డి విచ్చేశారు.. వారు మాట్లాడుతూ, ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచేందుకు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని, సమాజ ఆరోగ్యానికి మెడికవర్ హాస్పిటల్స్ చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు... డా.యన్. అభినవ్ రెడ్డి , ఆర్థోపెడిక్స్ మాట్లాడుతూ," వెన్నునొప్పిని నిర్లక్ష్యం చేయకుండా ప్రారంభ దశలోనే పరీక్షలు చేయించుకుంటే చాలా సమస్యలను సులభంగా నివారించవచ్చు. సరైన జీవనశైలి, వ్యాయామం కూడా వెన్నెముక ఆరోగ్యానికి ఎంతో అవసరం" అని తెలిపారు.




ఈ శిబిరంలో మెడికవర్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ మనోహర్ రెడ్డి కన్సల్టేంట్ కార్డియాలజిస్ట్, డాక్టర్ పి. విజయ కుమార్, సీనియర్ కన్సల్టేంట్ జనరల్ ఫిజిషియన్, డాక్టర్ N అభినవ్ రెడ్డి, (ఆర్థోపెడిక్) పాల్గొని వందలాది మందికి వైద్య సేవలు అందించారు.. ఈ కార్యక్రమం లో మెడికవర్ హాస్పిటల్ వైద్య సిబ్బంది డిపో మేనేజర్ అనిల్ కుమార్ మరియు, ఏపీ రోడ్డు రవాణా సంస్థ అధికారులు పాల్గొన్నారు...

# ఓటర్ నమోదు, సవరణ ప్రక్రియ ఆగస్టు 3 వరకు పొడిగింపు

సూర్యాపేట, ఓటర్ల జాబితా సవరణ పారదర్శకంగా నిర్వహించాలి. జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశంలో కలెక్టర్ వెల్లడించారు.భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు, జిల్లాలో చేపట్టిన 'ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను అత్యంత పారదర్శకగా, తప్పులేకుండా నిర్వహించాలని,జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఓటర్ల నమోదు మరియు సవరణ ప్రక్రియ వేగంగా సాగుతోందని తెలిపారు. షెడ్యూల్ ప్రకారం జూలై 24తో ముగియాల్సిన బీఎల్ఓల ఇంటింటి సర్వే గడువును, క్షేత్రస్థాయిలో మరింత పకడ్బందీగా నిర్వహించేందుకు ఆగస్టు 3వ తేదీ వరకు పొడిగించినట్లు, ఆయన ప్రకటించారు. జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్యూమరేషన్ ప్రక్రియ 100 శాతం పూర్తయిందని, సేకరించిన సమాచారాన్ని ఆన్‌లైన్ చేసే డిజిటలైజేషన్ ప్రక్రియ ప్రస్తుతం 87.55 శాతానికి చేరుకుందని తెలిపారు. హుజూర్ నగర్ నియోజకవర్గం ఈ ప్రక్రియలో ముందంజలో ఉందని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలో ఒకే వ్యక్తికి రెండు ఓట్లు ఉండటం, చనిపోయిన వారి పేర్లు అలాగే ఉండటం వంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో, బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటరు వివరాలను ధ్రువీకరించు కోవాలన్నారు. 2026 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే యువతీ యువకులందరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు.

# నీట్ పేపర్ లీకేజ్ కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి..!!

## నేడు విద్యాసంస్థల బంద్ ను జయప్రదం చేయండి ఎస్ఎఫ్ఐ.. డివైఎఫ్ఐ

బిఎన్ఎస్ న్యూస్ కడప జిల్లా జూలై 23: దేశవ్యాప్తంగా విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడిన నీట్ పేపర్ లీకేజ్ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని కడపజిల్లా ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. నేడు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న విద్యాసంస్థల బంద్ చేయాలని, బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్ వద్ద మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గండి సునీల్ కుమార్ మాట్లాడుతూ.. నీట్ పరీక్షల్లో జరిగిన పేపర్ లీకేజీలో దేశ విద్య వ్యవస్థ పై విద్యార్థులలో తీవ్ర ఆందోళనను కలిగించాయని అన్నారు. పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. నీట్ పరీక్షల అవకతవకలకు పూర్తి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే ప్రధాని నరేంద్ర మోడీ తక్షణమే జోక్యం చేసుకొని స్వతంత్ర, పారదర్శక విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. నేడు నిర్వహించనున్న విద్యాసంస్థల బంద్ ను విద్యాసంస్థల యాజమాన్యాలు సంపూర్ణ మద్దతు తెలిపి విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు సోమిరెడ్డిపల్లి అరవింద్, ఉపాధ్యక్షులు సంగటి దేవకుమార్, నాయకులు పాల్గొన్నారు.



# రహదారి భద్రత , సామాజిక బాధ్యత విధిగా ఆటో డ్రైవర్లు పాటించాలి

## డీ.టీ.ఓ & డి.ఎస్.పి



అమలాపురం (బీఎన్ఎస్) జూలై :22రహదారి భద్రత అదేవిధంగా సామాజిక బాధ్యత ఆటో డ్రైవర్లు పాటించాలని జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు, డి.ఎస్.పి ప్రసాద్ పిలుపునిచ్చారు.. బుధవారం

స్థానిక వాసర్ల గార్డెన్స్ నందు ఆటోరిక్షా డ్రైవర్లతో నిర్వహించిన "బడి పిల్లల భద్రత, బాధ్యత" కార్యక్రమంలో డీ.టీ.ఓ, డి.ఎస్.పి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీ.టీ.ఓ మాట్లాడుతూ బడి పిల్లలను తీసుకుని వెళ్లే ఆటో డ్రైవర్లు బాధ్యతాయుతంగా మెలగాలని, లగేజి స్థానంలో పిల్లలను కూర్చోపెట్టి కేసుల రూపంలో కష్టాలు కొనితెచ్చుకోవద్దని, నిబంధనలు ఉల్లంఘిస్తే మోటార్ వాహనాల చట్టం ప్రకారం కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు.

డి.ఎస్.పి మాట్లాడుతూ సామాజిక బాధ్యత విషయంలో ఆటో డ్రైవర్లు తమ వంతు పాత్ర పోషించాలని, అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండేది ఆటో సేవలు మాత్రమే అని అన్నారు.

ముమ్మిడివరం, కొత్తపేట, మలికిపురం ప్రాంతాల్లో త్వరలోనే సమావేశాలు నిర్వహిస్తామని డీ.టీ.ఓ తెలిపారు.

గత 25 సంవత్సరాలుగా ఆటో నడుపుతూ ఒక్క రోడ్డు ప్రమాదానికి కూడా ఆస్కారం ఇవ్వకుండా క్రమశిక్షణతో డ్రైవింగ్ చేస్తున్న ఇద్దరు ఆటో డ్రైవర్లను శాలువా కప్పి అధికారులు సన్మానించారు.

ఈ కార్యక్రమంలో ఎస్.ఐ కిషోర్, ఆటో యూనియన్ అధ్యక్షులు వాసంశెట్టి సత్తిరాజు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాలలో ఆర్.ఓ.ప్లాంట్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ



ఉమ్మడి నెల్లూరు జిల్లా వెంకటగిరి (బి.యన్.యస్):- ఉమ్మడి నెల్లూరు జిల్లా వెంకటగిరి పట్టణములోని క్రాస్ రోడ్ వద్ద ఉన్న బాలికల గురుకుల పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్.ఓ వాటర్ ప్లాంట్‌ను గౌరవ శాసనసభ్యులు శ్రీ కురుగొండ్ల రామకృష్ణ గురువారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ

గతంలో త్రాగునీటి సమస్యను గుర్తించిన ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు, TVS సంస్థ రూ. 3 లక్షలతో మొత్తం రూ. 3.3 లక్షలతో ఈ ప్లాంట్ ఏర్పాటైంది. ఈ సందర్భంగా TVS సంస్థకు ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పేదరికం లేని రాష్ట్రమే లక్ష్యం:

ప్రతి కుటుంబంలోని పిల్లలు చదువుకుంటేనే పేదరికం తొలగిపోతుందని, రాష్ట్రాన్ని పేదరికం లేని విధంగా తీర్చిదిద్దడమే మంత్రి శ్రీ నారా లోకేష్ గారి ప్రధాన ఉద్దేశ్యం అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అదేవిధంగా విద్యార్థులకు నాణ్యమైన యూనిఫామ్స్, రోజూ పాలు, గుడ్డుతో పాటు ఇడ్లీ, పులిహోర వంటి మంచి మెనూను ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు.

ప్రైవేట్ స్కూళ్ల భ్రమల నుంచి తల్లిదండ్రులు బయటకు రావాలని, ప్రభుత్వ బడుల్లోనే క్వాలిటీ టీచర్లు, మెరుగైన వసతులు ఉన్నాయని ఆయన పిలుపునిచ్చారు.

అదేవిధంగాఈ గురుకుల పాఠశాల నుండి కనీసం 30% మంది విద్యార్థినులు IAS, IPS అధికారులుగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.

# కూటమి పాలనలో విద్యా వ్యవస్థ పూర్తిగా పతనమైంది

బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా జూలై 23: కూటమి ప్రభుత్వంలో విద్యా వ్యవస్థ పూర్తిగా పతనమైంది అంటూ ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాద్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో రాచమల్లు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో విద్యా వ్యవస్థ పూర్తిగా పతనమైంది అని అంటూనే కూటమి ప్రభుత్వం ఏమి సాధించిందని రేపు మెగా టీచర్స్, పేరెంట్స్ డే నిర్వహిస్తున్నారు అని రాష్ట్ర విద్య శాఖ మంత్రి నారా లోకేష్ ను రాచమల్లు సూటిగా ప్రశ్నించారు.



అమ్మఒడి సృష్టికర్త వైఎస్ జగన్ అయితే లోకేష్ పేరు చెప్పడం చంద్రబాబు సిగ్గులేని తనానికి నిదర్శనం అన్నారు. పేద పిల్లలకు ఉన్నత విద్యనందించాలనే గొప్ప ఆలోచనతో జగన్ మోహన్ రెడ్డి అమ్మఒడి ని తెచ్చారు అన్నారు. తల్లికి వందనం పేరుతో అమ్మఒడిని నిర్వీర్యం చేస్తూ విద్యార్థులకు విద్యను దూరం చేస్తున్నారు. పిల్లలు మళ్లీ బడులు మాని పనులకు పోయే పరిస్థితిని చంద్రబాబు ప్రభుత్వం తెస్తుందని విమర్శించారు.

ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమంది కి తల్లికి వందనం ఇస్తామని చెప్పి 20 లక్షల మంది విద్యార్థులకు ఎగనామం పెట్టారు అన్నారు. రాష్ట్రంలో 87 లక్షల మంది పిల్లలు ఉంటే.. కేవలం 67 లక్షల మందికే అరకొరగా ఇస్తున్నారు. పాఠశాలల్లో మనబడి నాడునేడు పనులు ఆగిపోయింది వాస్తవం కాదా అన్నారు. విద్యాశాఖ మంత్రిగా లోకేష్ పనితనం ఇదేనా? 8, 9, 10 తరగతుల విద్యార్థులకు టాబ్స్ పంపిణీ నిలిపివేసి పిల్లల భవిష్యత్తును అంధకారం చేస్తున్నారు. జగన్మోహన్ రెడ్డి బాటలోనే అమ్మఒడి ని తల్లికి వందనంగా మార్చి జగన్మోహన్ రెడ్డి బాటలోనే అనుసరించాల్సిందే తప్ప తండ్రి, చంద్రబాబు నాయుడు, కొడుకు లోకేష్ మీరు చేసింది ఏమీ లేదు అంటూ కూటమి ప్రభుత్వ విద్య పాలనలో జరుగుతున్న మార్పులపై ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి మండిపడ్డారు.

# రాపూరు ఆర్టీసీ డిపోలో ఉచిత మెగా వైద్య శిబిరం

## శిబిరాన్ని ప్రారంభించిన ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి



నెల్లూరు జిల్లా రాపూరు (బి.యన్.యస్):- ఆర్టీసీ ఉద్యోగుల శారీరక, మానసిక ఆరోగ్య భద్రతే ధ్యేయంగా రాపూరు ఆర్టీసీ డిపో ప్రాంగణంలో గురువారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.?ఈ సందర్భంగా జోనల్ చైర్మన్ సురేష్ రెడ్డి మాట్లాడుతూ.. నిరంతరం ప్రజాసేవలో గడిపే ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర సిబ్బంది ఎదుర్కొనే ఒత్తిడి, శారీరక శ్రమ వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని పేర్కొన్నారు. వారి ఆరోగ్యాన్ని కాపాడేందుకు, ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా ఇలాంటి వైద్య శిబిరాలు ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. అనంతరం శిబిరంలో పాల్గొన్న ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల వైద్య బృందాలను అధికారులు శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ శిబిరంలో నిపుణులైన ఎముకల వైద్యులు, జనరల్ ఫిజీషియన్లతో పాటు ఆయుష్ పరిధిలోని ఆయుర్వేదం, హోమియోపతి, యునాని విభాగాల వైద్యులు పాల్గొని ఉచిత పరీక్షలు నిర్వహించారు. ఆర్టీసీ సిబ్బందితో పాటు సాధారణ ప్రయాణికులకు, స్థానిక ప్రజలకు బీపీ, షుగర్ తదితర పరీక్షలు చేసి, వ్యాధి తీవ్రతను బట్టి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.ఈ వైద్య శిబిరానికి ఆర్టీసీ కార్మికులు, వారి కుటుంబ సభ్యులు మరియు స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారు. తమ డిపో ప్రాంగణంలోనే నాణ్యమైన వైద్యం, ఉచిత మందులు అందించడం పట్ల ఉద్యోగులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.?ఈ కార్యక్రమంలో రాపూరు ఆర్టీసీ డిపో మేనేజర్ అనిల్ కుమార్, రాపూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ హర్సియా, డాక్టర్ నర్మదాదేవి, ప్రైవేట్ ఆసుపత్రుల వైద్యులు మరియు ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# స్కాలర్ షిప్, ఫీజు బకాయిల కోసం ఎబివిపి ఆందోళన




నల్లగొండ (బీఎన్ఎస్):

పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు 11000 కోట్లను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఛత్రపతి చౌహాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు... స్కాలర్షిప్ పథకం పై రాష్ట్ర ప్రభుత్వం కుట్రకు వ్యతిరేకంగా ఎబివిపి ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ యూనివర్సిటీ లో విద్యార్థులు తరగతులు బహిష్కరించి ఆందోళన నిర్వహించారు.. ఈ సందర్భంగా యూనివర్సిటీ లో విద్యార్థులు స్కాలర్ షిప్ లు, ఫీజు రీయాంబర్స్ మెంట్ చెల్లించాలని కోరుతూ ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పేద మధ్యతరగతి బడుగు బలహీన వర్గాల విద్యార్థుల విద్యకు బాసటగా నిలుస్తూ.. 18 లక్షల మంది విద్యార్థులకు అభయంగా నిలిచిన స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ పథకాన్ని ప్రభుత్వం ఎత్తివేసేందుకు కుట్రను పన్నుతోందని ఆరోపించారు... రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయడంతో పాటు ఈ పథకం ఎత్తివేయాలని ఆలోచనలను ప్రభుత్వం మానుకోవాలని లేనిపక్షంలో ఈ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా ఏబీవీపీ భారీ ఉద్యమాలు చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ స్టేట్ టెక్నికల్ సెల్ కన్వీనర్ నగేష్, జిల్లా టెక్నికల్ సెల్ కన్వీనర్ నరేందర్, నగర టెక్నికల్ సెల్ కన్వీనర్ సిద్దు, అక్షయ్, అగస్త్య తదితరులు పాల్గొన్నారు.

# వి బి జి రాంజీ పనుల్లో వేగం పెంచండి..

నల్లగొండ (బీఎన్ఎస్):

జిల్లాలో ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కూలీలందరికీ విబిజి రాంజీ పథకం కింద ఉపాధి కల్పించాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పథకంతో పాటు వివిధ అభివృద్ధి పనులపై జిల్లా కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. కరువు పరిస్థితుల్లో గ్రామీణ ప్రాంత కూలీలు వలస వెళ్లకుండా పనులు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.



విబిజి రాంజీ పథకం కింద చేపట్టే పనుల్లో భూగర్భ జలాల పెంపునకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, మ్యాజిక్ సోక్ పిట్స్, పర్క్యులేషన్ ట్యాంకులు, ఫార్మ్ పాండ్స్, ఓపెన్ వెల్స్, మ్యాజిక్ డ్రైన్స్ వంటి వాటర్ రీఛార్జ్ నిర్మాణాలను వెంటనే చేపట్టాలని ఆదేశించారు. నీటి కొరత కారణంగా రైతులు సంప్రదాయ పంటలకు భిన్నంగా కూరగాయల సాగుతో లాభాలు గడించేలా ప్రోత్సహించాలని హార్టికల్చర్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

# జీవో నెంబర్ 396 రద్దు అయ్యే వరకు వైసిపి పార్టీ చంద్రబాబు నాయుడుతో పోరాడుతుంది.

బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా జూలై 23:

మైదుకూరులో నాల్గవ రోజు దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చేస్తున్న ధర్నాకు మద్దతుగా ధర్నాలో పాల్గొన్న మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి స్టాంపు వెండర్లను, దస్తావేజు లేఖరులను ఉద్దేశించి మాట్లాడుతూ..



నమ్మిన వారిని వెన్నుపోటు పొడవడం చంద్రబాబు నాయుడుకు వెన్నతో పెట్టిన విద్య అంటూనే ప్రజల ఆస్తులను ప్రైవేటుపరం చేయడానికి చంద్రబాబు చాలా ఆసక్తితో ఉన్నాడు అన్నారు. చంద్రబాబు నాయుడు చేస్తున్న పనికిమాలిన చర్య వల్ల ప్రజల డేటా అంత ప్రైవేటు వ్యక్తులు చేతులలోకి వెళుతుంది అంటూ స్టాంపు డ్యూటీ కట్టించుకునేది ప్రైవేట్ వ్యక్తులు అంటే ప్రభుత్వాదాయాన్ని వారి చేతుల్లో పెట్టినట్లే కదా అన్నారు. చంద్రబాబు నాయుడు చేస్తున్న పనుల వల్ల ప్రజల ఆస్తులకు భద్రత కరువు అవుతుందని తెలిపారు. కాబట్టి చంద్రబాబు చేస్తున్న పనుల వల్ల ప్రజల ఆస్తుల వివరాలు అక్రమాకుల చేతులకు వెళ్లడం ఖాయం అన్నారు. ఇప్పటికైనా జీవో నెంబర్ 396 ను రద్దుచేసి దస్తావేజు లేఖర్ల, స్టాంపు వెండేర్ల జీవనోపాధిని కాపాడాలని తెలిపారు.ఈ జీవో నెంబర్ 396 రద్దు అయ్యే వరకు వైసిపి పార్టీ చంద్రబాబు నాయుడు తో పోరాటం చేస్తామని, దస్తావేజు లేఖరుల సమ్మె కార్యక్రమంలో పాల్గొని కూటమి ప్రభుత్వ నిర్ణయాలు, అనిర్ణయాలు అమలు చేస్తున్న రాష్ట్రం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పై పెద్ద ఎత్తున మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురాంరెడ్డి మండిపడ్డారు.

BNS BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ అఫ్ న్యూ భారత్
24-07-2026

# దగ్గవోలు గ్రామంలో సిమెంట్ రోడ్డుపై మురుగు నీరు

## ప్రజలకు తప్పని తీవ్ర ఇబ్బందులు



ఉమ్మడినెల్లూరు జిల్లా దక్కిలి(బి.యస్.యస్):– ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోని దక్కిలి మండలం దగ్గవోలు గ్రామంలోని ఎగువ మిట్ట ప్రాంతంలో సిమెంట్ రోడ్డుపై మురుగు నీరు నిల్వ ఉండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాలు కురిసిన ప్రతిసారి నీరు రోడ్డుపైనే నిలిచిపోవడంతో వాహన దారులు,పాదచారులు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ముఖ్యంగా పాఠశాల విద్యార్థులు, వృద్ధులు, ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మురుగు నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు పెరిగి సీజనల్ వ్యాధులు వ్యాపించే ప్రమాదం కూడా ఉందని స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి నీరు సక్రమంగా వెళ్లేలా కాలువలు ఏర్పాటు చేసి, రోడ్డును మరమ్మతు చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# ఎన్ఐటీ వరంగల్ లో భారతీయ మజ్దూర్ సంఘ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

హనుమకొండ :ఎన్ఐటీ వరంగల్ లో ఎన్ఐటి మెయిన్ గేట్ ముందు ఎన్ఐటి డబ్ల్యూ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికుల భారతీయ మజ్దూర్ సంఘ్ అధ్యక్షులు కొలిపాక కరుణాకర్,ప్రధాన కార్యదర్శి మదూరి.మల్లేశం ఆధ్వర్యంలో "భారతీయ మజ్దూరి సంఘ్' యూనియన్ ఆవిర్భావం నేటికి 71 సంవత్సరాలు పూర్తి చేసుకొని 72 సంవత్సరం లోకి అడుగుపెట్టిన సందర్భంగా" మజ్దూర్ సంఘ్' జెండా ఎగరవేసి ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మార్తినేని ధర్మారావు,బీఎంఎస్ తెలంగాణ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జి.మహేందర్ హాజరై మాట్లాడారు. దేశ అభివృద్ధి లో కార్మికుల పాత్ర ఎంతో కీలకమని, జాతీయ భావనతో సమాజ సేవలో కార్మికులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడు కాట్ల నాగు,బీఎంఎస్ సీనియర్ నాయకులు,ఎం.రవీందర్ రావు,బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కొమురవెల్లి,బీజేపీ నాయకుడు రాం మోహన్, బిజెపి మాజీ కార్పొరేటర్ రామలింగం, ఎన్ఐటీ వరంగల్ భారతీయ మద్దూరి సంఘ్ కార్మికులు, వర్కర్స్ యూనియన్ మాజీ నాయకులు బర్ల యాకూబ్,జిల్లా ప్రధాన కార్యదర్శి కార్తీక్,కార్మిక నాయకులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నిర్వాహకులను అతిథులు అభినందించారు.సుమారు 200 మంది కార్మికులు,ఈ కార్యక్రమానికి హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు.ఆవిర్భావ దినోత్సవ వేడుక కార్యక్రమంలో పాల్గొన్న కార్మికులందరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.



# ఉబర్, ఓలా, రాపిడో సంస్థల తీరుకు నిరసనగా ఆటో కార్మికుల సమ్మె

హైదరాబాద్, రామంతపూర్: ఉబర్, ఓలా, రాపిడో వంటి యాప్ ఆధారిత క్యాబ్ సేవల సంస్థలు అమలు చేస్తున్న చార్జీల విధానం, ఆటో డ్రైవర్లకు కలుగుతున్న నష్టాలకు నిరసనగా రామంతపూర్ శ్రీనగర్ కాలనీ ఆటో యూనియన్ సభ్యులు సమ్మె నిర్వహించారు.ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు జక్కా పర్వతాలు ఆధ్వర్యంలో జక్కా నాగ మల్లయ్య, గోపాల్, రమేష్, వస్పరి నరేష్, ఎస్పీ పరశురాం, దండు బాల, దండు సైదులు, జక్కా డాంగ్లీ, పబ్బాల చిన్నయ్య, పబ్బాల శ్రీను, బాలస్వామి, గణేష్, సంపత్ తదితర సభ్యులు పాల్గొన్నారు. ఈ సమ్మె ఐఎన్టీయూసీ నాయకుడు సంజీవ్ రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా జక్కా నాగ మల్లయ్య, హైదరాబాద్ వైస్ ప్రెసిడెంట్, ఆటో యూనియన్ (శ్రీనగర్ కాలనీ, రామంతపూర్), మాట్లాడుతూ యాప్ ఆధారిత సంస్థలు ఆటో డ్రైవర్లకు న్యాయమైన చార్జీలు, కమిషన్ విధానంలో పారదర్శకత కల్పించాలని ప్రభుత్వాన్ని, సంబంధిత సంస్థలను కోరారు.



# మృతుడు గోగుల వెంకులు కుటుంబానికి అండగా నిలిచిన, చల్లా కృష్ణ.

ఖమ్మం : పాలేరు నియోజకవర్గ పరిధిలోని 59 డివిజన్ దానవాయిగూడెం కాలనీ కి చెందిన, గోగుల వెంకులు ఇటీవల కాలంలో అకస్మాత్తుగా మరణించారు. విషయం తెలుసుకున్న రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరుడు తుంబురు దయాకర్ రెడ్డి సలహామేరకు కాంగ్రెస్ పార్టీ ఖమ్మం టౌన్ జనరల్ సెక్రటరీ చల్లా కృష్ణ మృతుల కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సహాయం అందించి వారి కుటుంబానికి మనోధైర్యం ని నింపారు. రోజు దశదిన కార్యక్రమానికి తమ వంతు సహాయంగా చల్లా కృష్ణ 5,000/ రూపాయలు కుటుంబ సభ్యులకు అందజేశారు. వారి కుటుంబానికి ఎల్లపుడూ, కాంగ్రెస్ పార్టీ తరుపున అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చల్లా కృష్ణ టీమ్ సభ్యులు మరియు మృతుడి బంధువులు పాల్గొన్నారు.



# వందల ఏళ్ల చరిత్ర గల కోటమైసమ్మ

## నూతన ఆలయం ఘనంగా విగ్రహ ప్రతిష్టాపన



నారాయణపేట్, జులై 23 (బీఎన్ఎస్):నారాయణపేట్ జిల్లా గుండుమాల్ మండల కేంద్రంలో వందల ఏళ్ల చరిత్ర కలిగిన కోటమైసమ్మ పురాతన గుడి శిథిలావస్థకు చేరుకోవడంతో, అదే స్థలంలో నూతన ఆలయాన్ని నిర్మించి మైసమ్మ విగ్రహ ప్రతిష్టాపనను ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సుంకిరెడ్డి కుటుంబ సభ్యులు --- సుంకిరెడ్డి పద్మారెడ్డి, దామోదర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, సురేష్ రెడ్డి, విక్రమ్ రెడ్డి, సుంకిరెడ్డి రాజశేఖర్ రెడ్డి. సుంకిరెడ్డి సతీష్ రెడ్డి. తదితరులు తమ సొంత ఖర్చులతో ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేశారు.

ఇంటి దేవతగా భావించే కోటమైసమ్మ తమ కుటుంబాలకు, కోటకు ఎన్నో ఏళ్లుగా రక్షణగా నిలుస్తూ వస్తోందని, పెద్దల నుంచి వస్తున్న ఆనవాయితీ ప్రకారం ప్రతి సంవత్సరం మైసమ్మను భక్తిశ్రద్ధలతో పూజిస్తూ వస్తున్నామని వారు తెలిపారు.

ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్త ఆలయ నిర్మాణంతో గ్రామంలో భక్తి వాతావరణం నెలకొంది.

# ప్రీ ప్రైమరీ ఇన్స్ట్రక్టర్ ఉద్యోగాల నియామకంలో అక్రమాలు

ఖమ్మం: చింతకాని మండలం వందనం గ్రామంలో జరిగిన ప్రీ ప్రైమరీ ఇన్స్ట్రక్టర్ ఉద్యోగాల నియామక ప్రక్రియలో తనకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆ గ్రామానికి చెందిన దగ్గుబాటి సామ్రాజ్యం ఆవేదన వ్యక్తం చేశారు. అర్హతలు ఉన్నప్పటికీ తనను పక్కనపెట్టి, అర్హత లేని, తక్కువ అర్హతలు కలిగిన ఇతర వ్యక్తులకు ఉద్యోగాలు కట్టబెట్టారని ఆమె ఆరోపించారు. ఖమ్మం లోని ప్రెస్ క్లబ్ లో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సామ్రాజ్యం మాట్లాడుతూ ఉద్యోగాల ఎంపిక విషయంలో గ్రామ అధికార పార్టీ నాయకులు, సంబంధిత ప్రభుత్వ అధికారులతో కుమ్మక్కై వ్యవహరించినట్లు అనుమానం వ్యక్తం చేశారు. ఇంటర్వ్యూ పేరుతో అభ్యర్థులను రోజుల తరబడి కాలయాపన చేయించి, చివరకు నిబంధనలకు అనుగుణంగా ఇంటర్వ్యూ కూడా నిర్వహించలేదని ఆరోపించారు. కేవలం ఒక నిమిషం పాటు ఇంటర్వ్యూ నిర్వహించి, అభ్యర్థుల అర్హతలు, విద్యార్హతలు, అనుభవాన్ని సరిగా,పరిశీలించకుండా ఉద్యోగాలకు ఎలా ఎంపిక చేశారని ఆమె ప్రశ్నించారు. ఇంటర్మీడియట్ కనీస అర్హతగా ఉన్నప్పటికీ, దానికంటే ఎక్కువ విద్యార్హతలు కలిగిన అభ్యర్థులను పక్కనపెట్టి, స్థానిక నాయకులకు నచ్చిన వారికి ఇష్టారాజ్యంగా ఉద్యోగాలు కట్టబెట్టారని ఆరోపించారు. ఈ నియామకాల విషయంలో డబ్బులు చేతులు మారినట్లు తమకు అనుమానంగా ఉందన్నారు. ఉద్యోగాల నియామకానికి సంబంధించిన దరఖాస్తులు, అభ్యర్థుల అర్హతలు, ఇంటర్వ్యూ ప్రక్రియ, ఎంపిక జాబితా, అధికారుల పాత్రపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరపాలని ఆయన కోరారు. అక్రమాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకొని, అర్హత కలిగిన అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ వ్యవహారంపై సంబంధిత ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి తగిన విచారణ జరపాలి. నాకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్ది న్యాయం చేయాలి. ఉద్యోగాల ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా మళ్లీ పరిశీలించాలి అంటూ డిమాండ్ చేశారు.

# రమణేశ్వరంలో అద్భుతం

## సిద్ధ గురు మౌన దీక్షా హోమంలో సాక్షాత్కరించిన ప్రత్యక్ష దేవతా మూర్తులు

- ఘనంగా సాగుతున్న 'మౌన ధ్యాన తపో దీక్ష' • హవనంలో దర్శనమిచ్చిన షిర్డీ సాయిబాబా, వారాహి అమ్మవారు
- ఆధ్యాత్మిక అద్భుతాన్ని చూసి పరవశించిన భక్తులు • కిటకిటలాడుతున్న రమణేశ్వర పుణ్యక్షేత్రం

రమణేశ్వరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన రమణేశ్వరంలో ఆధ్యాత్మిక పరవశం ఆకాశాన్ని తాకుతోంది. క్షేత్ర పీఠాధిపతి సిద్ధ గురు శ్రీ రమణానంద మహర్షి ఆచరిస్తున్న 'మౌన ధ్యాన తపో దీక్ష' నేపథ్యంలో ఆశ్రమంలో అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక నిష్ఠతో ప్రత్యేక పూజలు, హోమాలు కొనసాగుతున్నాయి. లోక కల్యాణార్థం సిద్ధ గురు స్వీకరించిన ఈ మౌన దీక్షతో రమణేశ్వర క్షేత్రమంతా దివ్యమైన తపోశక్తితో విరాజిల్లుతోంది.



ఈ తపో దీక్షా కాలంలో భాగంగా ఆశ్రమ ప్రాంగణంలో నిత్యం నిర్వహిస్తున్న విశేష హవనం సమయంలో ఒక అద్భుత ఆధ్యాత్మిక ఘట్టం ఆవిష్కృతమైంది. వేద పండితుల మంత్రోచ్ఛారణలు, భక్తుల జప నినాదాల మధ్య సాగుతున్న హోమ గుండంలో దేవతా మూర్తులు సాక్షాత్కరించడం అక్కడ ఉన్న వేలాది మంది భక్తులను ఆకట్టుకుంది. ఈ అద్భుత దృశ్యం క్షేత్రంలో పెద్ద ఎత్తున చర్చనీయాంశంగా మారింది.

హోమం తీవ్ర రూపం దాల్చిన సమయంలో, ఎగిసిపడుతున్న యజ్ఞ జ్వాలల్లో షిర్డీ సాయిబాబా దివ్య రూపంతో పాటు మహా శక్తి స్వరూపిణి అయిన శ్రీ వారాహీ అమ్మవారి ఆకృతులు దర్శనమిచ్చాయి. యజ్ఞ గుండం నుంచి వెలువడిన దివ్య కాంతులు, బాబా మరియు వారాహి అమ్మవారి ప్రతిరూపాలుగా రూపాంతరం చెందడం చూసి భక్తులు పులకించిపోయారు. గురుదేవుల తపోశక్తికి, నిష్ఠకు దేవతా మూర్తులు ప్రసన్నులై ఇలా దర్శనమిచ్చారని ఆశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

ఈ అద్భుత దృశ్యాన్ని కళ్లారా చూసిన భక్తులు భక్తిపారవశ్యంతో "జై సాయిరామ్", "జై జై వారాహి" "జై జై సిద్ధ గురు" అంటూ చేసిన నామస్మరణలతో రమణేశ్వర ప్రాంగణం మారుమోగిపోయింది. సిద్ధ గురు శ్రీ రమణానంద మహర్షి చేపట్టిన మౌన ధ్యాన తపో దీక్ష ఎంతటి మహిమాన్వితమైనదో ఈ దైవిక సంఘటన రుజువు చేసిందని, ఇది సాక్షాత్తూ దైవ సంకల్పమని స్థానిక భక్తులు, సాధకులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.



ప్రస్తుతం సిద్ధ గురు శ్రీ రమణానంద మహర్షి సంపూర్ణ మౌనంలో ఉంటూ నిరంతర ఆత్మ ధ్యానంలో గడుపుతున్నారు. బాహ్య సంభాషణలు పూర్తిగా విరమించి, కేవలం తపో సాధనలోనే లీనమయ్యారు. గురుదేవుల ఈ మౌన సమక్షంలో ప్రార్థనలు చేయడం వల్ల తమ మనస్సుకు ఎనలేని ప్రశాంతత లభిస్తోందని, నిత్య జీవితంలో పడుతున్న మానసిక ఒత్తిళ్లు సమసిపోతున్నాయని ఆశ్రమానికి వస్తున్న భక్తులు వెల్లడిస్తున్నారు.

నలుమూలల నుంచి రమణేశ్వరానికి భక్తుల తాకిడి విపరీతంగా పెరిగింది. విశేష పూజలు, రుద్రాభిషేకాలు, చండీ హోమాలు మరియు వారాహి



సహస్రనామ అర్చనలు నిరంతరాయంగా జరుగుతున్నాయి. హోమ గుండం నుంచి ప్రసరిస్తున్న పవిత్ర ధూపం, వేద మంత్రాల ధ్వనులు ఆశ్రమ వాతావరణాన్ని ఒక దివ్యమైన లోకంగా మార్చివేశాయి.

దేవతా మూర్తుల సాక్షాత్కారం మరియు గురుదేవుల తపో దీక్ష కారణంగా రమణేశ్వరం క్షేత్రానికి వచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. దీంతో ఆశ్రమ కమిటీ ప్రతి ఒక్కరికీ సులభంగా దర్శనం లభించేలా, ధ్యానంలో పాల్గొనేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, ప్రసాద వితరణ మరియు ఉచిత అన్నదాన కార్యక్రమాలను నిరంతరాయంగా నిర్వహిస్తున్నారు.

ఈ సుదీర్ఘ తపస్సు పూర్తి చేసుకుని సిద్ధ గురు మౌనాన్ని వీడిన అనంతరం ఇచ్చే అనుగ్రహ భాషణం కోసం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆయన అనుచరులు, భక్తులు ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు.